క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆరోగ్య కేంద్రంలో పరిశీలన చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

సింహాచలం : అడవివరం ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా టీమ్ సందర్శించింది. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ సేవలు తదితర వాటిని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం డీసీఎస్ ప్రసాద్‌నాయక్, వైద్యులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న పంచకర్ల



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రమేష్‌బాబు దంపతులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో నరసింహరాజు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత

సింహాచలం : టీచర్స్ లేఅవుట్, విరాట్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో జీవీఎంసీ రూ. 40 లక్షలతో నిర్మించనున్న తారురోడ్డు పనులకు వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. నాణ్యతాపరంగా పనులు సాగాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శానాపతి శంకరరావు, కాలనీ ప్రతినిధులు నగేష్‌బాబు, బాలసుబ్రహ్మణ్యం, రెహమాన్, మహేష్, అర్జునరావు పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు

పరవాడ: మండలంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి పందాలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. అదే విధంగా అసాంఘిక నృత్యాలు, రికార్డు డ్యాన్సులు నిర్వహించడం, అందుకు సహకరించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ పైన తెలిపిన అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ నిర్వహించినా పరవాడ పోలీస్ స్టేషన్‌కు 9440796038 నంబరుకు సమాచారం అందించాలని సీఐ ఆ ప్రకటనలో కోరారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

సబ్బవరం: మండలంలోని అజనగిరి శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రంగనాథం తెలిపారు. వారి వద్ద నుండి రూ. 660 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో షేక్ రెహమాన్ (60), బొడ్డేపల్లి తాతబాబు (47), యర్రా సింహాద్రి (45), ఇందల సత్యారావు (49)పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

'ది స్టోరీ ఆఫ్ బ్యూటీఫుల్ గర్ల్' పోస్టర్ ఆవిష్కరణ

అగనంపూడి: రవిప్రకాష్ దర్శక నిర్మాణంలో రూపొందించిన 'ది స్టోరీ ఆఫ్ బ్యూటీఫుల్ గర్ల్' సినిమా పోస్టర్ ఆవిష్కరణ దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో గురువారం సాయంత్రం నిర్వహించారు. నటులు నిహాల్, కిరణ్ అబ్బవరం, దృషిక చందర్ పాల్గొని సందడి చేశారు.

సింహగిరిపై కొనసాగుతున్న ధారోత్సవాలు



అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకుడు



వెంకటాద్రిపై గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం : సింహగిరిపై మూడవరోజు గురువారం ధారోత్సవాలను విశేషంగా నిర్వహించారు. ఉదయం గోదాదేవి అమ్మవారు, చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలో తిరువీధిగా ఆలయ ఈశాన్య దిక్కులో ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లని వేంజేపచేశారు. గంగధార జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి గంగధార వద్ద మండపంలో వేంజేపచేశారు. పాశుర విన్నప పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాస పూజలు

సింహాచలం : పెందుర్తి వెంకటాద్రిపై గురువారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం విశేషంగా తిరుప్పావై సేవాకాలం జరిపించారు. గోదాదేవికి, వేంకటేశ్వరస్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ ఈ పూజలు నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో..

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలను విశేషంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై వేంజేపచేశారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

రేపు అప్పన్న ఆలయంలో గోదా కల్యాణం

సింహాచలం : భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గోదాకల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవోవి.త్రినాథరావు గురువారం తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు కల్యాణం జరుగుతుందని, ఆరోజు ఉదయం 9.30గంటలకు నిర్వహించాల్సిన స్వామివారి నిత్యకల్యాణాన్ని గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 16న సాయంత్రం కొండదిగువ పూలతోటలో గజేంద్ర మోక్షం ఉత్సవాన్ని కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులంతా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాల్సిందిగా కోరారు. గజేంద్రమోక్షం సందర్భంగా 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

మెరుగైన పనితనం కనబరచాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు

సబ్బవరం: అర్హులందరికీ క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందే విధంగా పంచాయితీ కార్యదర్శులు పని చేయాలని ఎంపీడీవో రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయితీ సర్పంచ్‌లు, కార్యదర్శులతో సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందలేదన్న సమాచారం ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పింఛన్ల తొలగింపుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అర్హత ఉంటే నివేదికలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎస్ బాబురావు, ఈవోపీఆర్‌డీ మహేష్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా వారోత్సవాలు



రహదారి భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న పరవాడ సీఐ ఈశ్వరరావు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఎంఎఎస్‌ఆర్‌ఎం ఆధ్వర్యంలో గురువారం రహదారి భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరవాడ సీఐ పి.ఈశ్వరరావు పాల్గొని వాహన చోదకులకు రహదారి భద్రతపై సూచనలు చేశారు. విశాఖ రోటరీ క్లబ్ సౌజన్యంతో వాహన చోదకుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ ఎం. సుష్మ బృందం 146 మంది డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, రక్తపోటు, గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఏఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మధు, లుపిన్ పరిశ్రమ భద్రతా అధికారి నారాయణరావు రహదారి భద్రతపై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు



నాయుడుపాలెంలో మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో గురువారం వేకువ జామున మేలు కొలుపు కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నాయుడుపాలెం వినాయక ఆలయం, వాడచీపురుపల్లి రామాలయం కేంద్రంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగవంతుడిని భక్తి శ్రద్ధలతో పల్లకిలో పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రచార ధర్మకర్త వెన్నల అప్పలనాయుడు, నాయుడుపాలెం సర్పంచ్ కె.వరలక్ష్మి సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, కె.శ్రీనివాసరావు, లాలం అప్పలనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 700వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 700వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ట్రాఫిక్ మరియు పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షల్లో పాల్గొన్న సీహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. మహనీయుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైన సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు సాగిస్తామన్నారు. ఉక్కును కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనలో కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, గంధం వెంకటరావు, అయోధ్యరామ్, కారునాయుడు, జె.రామకృష్ణ, మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాత్విక జీవనమే.. ప్రాక్పశ్చిమ సమ్మేళనం



నావాణి సంచికను ఆవిష్కరిస్తున్న సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు, కృష్ణమోహన్, బీఆర్‌కే రాజు

దాబాగార్డెన్స్ : సనాతన ధర్మం, పరమ గురువుల బోధనల ఆధారంగా జీవించడమే ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమని జగద్గురు పీఠం భౌగోళిక అధ్యక్షుడు కె. గురుప్రసాద్ పేర్కొన్నారు. గురుపూజోత్సవాల్లో భాగంగా అకోశా హాల్లో జగద్గురు పీఠం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాస్టర్ ఈకే, మాస్టర్ పార్వతీకుమార్ బోధనలకు 26 దేశాల్లో 65 బృందాలు ప్రభావితమై యోగ జీవనాన్ని గడుపుతున్నట్లు తెలిపారు. సంస్థ భౌగోళిక కో ఆర్డినేటర్, స్విట్జర్లాండ్ దేశీయుడు బుడ్జర్ మాట్లాడుతూ వివిధ భాషల్లోకి పరమ గురువుల జ్ఞానాన్ని పంచిపెట్టి ఆధ్యాత్మికతను పెంపొందింప జేయడానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రీస్ దేశీయుడు హెన్రీ మాట్లాడుతూ మాస్టర్ ఈకే, మాస్టర్ కేపీతో పరిచయం ఏర్పడిన కారణంగా తనకు యోగపరమైన జీవన విధానం లభించిందన్నారు. స్విట్జర్లాండ్ వనిత డాక్టర్ సెబీనా, స్పెయిన్ దేశీయుడు మైగెల్, సంస్థ అధ్యక్షుడు కెఎస్ శాస్త్రి, ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ మూర్తి, సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పాల్గొన్నారు.

నావాణి స్వర్ణోత్సవ సభ..

జ్ఞానాన్ని సాధకులకు అందించడానికి మాస్టర్ ఈకే 1972లో నావాణి మాసపత్రికను నెలకొల్పారని జగద్గురు పీఠం సలహా మండలి సభ్యుడు సీహెచ్‌ఎస్ఎన్ రాజు చెప్పారు. 62వ గురుపూజోత్సవాల్లో గురువారం నావాణి దర్శన మాసపత్రిక స్వర్ణోత్సవ సభను వైభవంగా నిర్వహించారు. పసుమర్తి కృష్ణమోహన్, బీఆర్‌కే రాజు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన



వివాదాస్పదంగా మారిన కాలువ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ ఏఈ లలిత

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామంలో వివాదాస్పదంగా మారిన సీసీ కాలువను రోడ్లు భవనాల శాఖ ఏఈ లలిత గురువారం సందర్శించి పరిశీలించారు. ఇక్కడ పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ కాలువ నిర్మాణం చేపడుతున్న స్థలం తనదంటూ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. కాలువ నిర్మాణం జరుపుతున్న స్థలం రోడ్లు–భవనాల శాఖకు చెందినదని.. సదరు స్థలంలో అభివృద్ధి పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ బండారు కల్పనరాజశేఖర్ ఆర్ అండ్ బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుతో రోడ్లు–భవనాల శాఖ ఏఈ లలిత స్థానిక రెవెన్యూ అధికారులతో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని గురువారం పరిశీలించారు. అలాగే రోడ్లు–భవనాల శాఖకు చెందిన మ్యాప్‌ను పరిశీలించిన అనంతరం సదరు స్థలం ఆర్ అండ్ బి శాఖదా కాదా అన్న విషయాన్ని నిర్ధారిస్తామని చెప్పారు. అనంతరం జాజులవానిపాలెం–పి.బోనంగి రహదారిలో శిథిలావస్థకు చేరిన కల్వర్టును పరిశీలించారు. కల్వర్టు మరమ్మతులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని ఏఈ లలిత చెప్పారు. ఆమె వెంట గ్రామ సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగమణి, వీఆర్వో సత్యనారాయణ, స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి



వివేకానంద జయంతి నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి సూర్యకళ తదితరులు



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పీవీ రమణ తదితరులు

సింహాచలం : పెందుర్తి శాఖా గ్రంథాలయంలో గురువారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి విశ్రాంత ఉపాధ్యాయుడు రంగలి జానకిరామ్‌నాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివేకానందుడి జీవిత చరిత్రపై విద్యార్థులకు డిబేట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పీవీ రమణ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. భారతీయ సనాతన సాంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన మహనీయుడు వివేకానందుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పిల్లలు, పాఠకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పతంగుల పండగ



అల్లిపురంలో గాలిపటాల దుకాణాలు



గాలిపటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- నగరానికి సంక్రాంతి శోభ
- జోరందుకున్న గాలిపటాల అమ్మకాలు

అల్లిపురం: సంక్రాంతి వచ్చిందంటే చాలు గాలిపటాల సందడి నగరంలో ప్రారంభమవుతుంది. ఎక్కడ చూసినా రంగు రంగుల గాలిపటాలతో దుకాణాలు దర్శనమిస్తాయి. గాలిపటాలతో పెద్దవారు కూడా చిన్నపిల్లలైపోతారంటే అతిశయోక్తి కాదు. నగరంలో గాలిపటాల విక్రయాలంటే గుర్తుకు వచ్చేది మొదట అల్లిపురం అని చెప్పకోవచ్చు. సంక్రాంతి సెలవులు కూడా తోడవటంతో పిల్లలు రోజంతా గాలిపటాలతో కాలక్షేపానికి సిద్ధమైపోతారు. రాకెట్, స్పైడర్‌మేన్, గ్రద్ద, క్రికెట్, టెన్నిస్ క్రీడాకారుల ఫొటోలతో పాటు పక్షులు, జంతువులు వంటి వాటికి గిరాకీ ఉంటుంది. మార్కెట్‌లో రూ.5 నుండి రూ.3,000 వరకు గాలిపటాల అమ్మకాలు జరుపుతున్నారు.

చరక.. గాలి పటాలను ఎగురవేసేందుకు చరక తప్పనిసరి. గాలిపటం పైకి వెళ్లిన తర్వాత దారం త్వరగా వదిలేందుకు, చుట్టేందుకు ఈ చరక ఉపయోగపడుతుంది. చరకను వెదురు కర్రతో తయారు చేస్తారు. మార్కెట్‌లో ప్లాస్టిక్, స్టీల్‌వి దొరుకుతున్నాయి. వీటి ధర రూ.20 నుండి రూ.500 వరకు ఉంటుంది.

గాలిపటాలకు ప్రత్యేకం అల్లిపురం.. గాలిపటాల వ్యాపారానికి పెట్టింది పేరు నగరంలోని అల్లిపురం. ఇక్కడ గాంధీ బొమ్మ పక్క నుండి వెళితే కుమ్మరవీధి రోడ్డులో గాలిపటాల విక్రయాల షాపులు దర్శనమిస్తాయి. వీధిలో గాలిపటాలను అందంగా అలంకరించి ఉంచుతారు. పిల్లలతో సందడిగా ఈ వీధి నిత్యం కళకళలాడుతుంటుంది. ఇక్కడ రిటైల్, హోల్‌సేల్‌గా అమ్మకాలు జరుపుతారు. నగరంలో పెద్ద పెద్ద దుకాణాలకు ఇక్కడి నుండే సరఫరా చేస్తుండటం విశేషం. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాల వారు ఇక్కడి నుండే గాలిపటాలను కొని పట్టుకెళ్తుంటారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

పిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా పరిశీలించాలి. ఆనందాన్ని నింపే పతంగులు ఎగురవేసే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు తప్పవు. భవనంపైకి ఎక్కి పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తుంటారు. ఆకాశంలో అందంగా ఎగురుతున్న గాలిపటం పైనే దృష్టి పెట్టి డాబాలపై తిరుగుతుంటారు. భవనంపై ప్రహరీ లేకపోయినా, చిన్నగా ఉన్న భవనాలపైకి పిల్లలను పంపకూడదు. అదే విధంగా విద్యుత్ తీగలకు చిక్కుకునే గాలిపటాలను పిల్లలు తీసే ప్రయత్నం చేస్తే వారిని ఆపండి. లేకపోతే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. విశాలమైన ఖాళీ ప్రదేశంలో గాలిపటాలు ఎగురవేసుకోమని చెప్పాలి. తప్పనిసరి అయితే తల్లిదండ్రులు దగ్గరుండి గాలిపటాలను పిల్లలతో ఎగురవేయించటం ఉత్తమం.

పెరుగుతున్న ఆదరణ



గత రెండు సంవత్సరాలు కరోనా కారణంగా ఆదరణ తక్కువగా ఉంది. ఈ ఏడాది ఆదరణ బాగుంది. కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, జంషెడ్‌పూర్, హైదరాబాద్ ప్రాంతాల నుండి గాలిపటాలను దిగుమతి చేసుకుంటున్నాము. సంక్రాంతి రోజులతో పాటు ఏడాది పొడవునా గాలిపటాల అమ్మకాలు జరుపుతుంటాము.

–బొట్టా రమేష్,
గాలిపటాల వ్యాపారి, అల్లిపురం

షాపులు పెరిగిపోయాయి



గతంలో విశాఖపట్నంలో అల్లిపురంలో మాత్రమే గాలిపటాలు దొరికేవి. మేము ఈ ప్రాంతంలో గత మూడు దశాబ్దాలుగా అమ్మకాలు జరుపుతున్నాం. ప్రస్తుతం రాష్ట్రం విడిపోయిన తరువాత విశాఖలో గాలిపటాల సందడి పెరిగింది. సంక్రాంతి సమయంలో గాలిపటాలకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం చాలా షాపులు ప్రారంభమయ్యాయి. దీంతో మాకు డిమాండ్ తగ్గింది.

–బొట్టా భవానీశంకర్,
గాలిపటాల వ్యాపారి, అల్లిపురం

క్రికెట్ పోటీల విజేత తులసీరాం జట్టు



విజేత జట్లతో సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని 69వ వార్డు తుంగ్లాం ఎస్సీ కాలనీలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. గురువారం జరిగిన ఫైనల్ పోటీలో కణితి సింహాచలం జట్టుపై గెద్దం తులసీరామ్ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. పెట్ల వెంకటేష్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. బి.ఆర్.అంబేడ్కర్ యూత్ నాయకుడు గెద్దం శివ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు పెట్ల అర్జునరావు, కార్యదర్శి శ్రీను, ఈతలపాక మంగరాజు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు పెట్ల వెంకటరమణ, పెట్ల అప్పారావు, ఎలుసూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి



నాట్యగురువు సందీప్‌కుమార్‌తో చిన్నారులు

గాజువాక: సంక్రాంతి సంబరాల్లో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ సార్వత్రిక పరిషత్‌లో నిర్వహించిన నృత్య పోటీల్లో గాజువాకకు చెందిన కళారాధన అకాడమీ చిన్నారులు ప్రథమ బహుమతిని సాధించారు. వారు ప్రదర్శించిన శివతాండవం నృత్యానికి బహుమతితో పాటు 2023 టాలెంట్ అవార్డును ప్రముఖ నాట్య గురువు రాధేశ్యామ్ చేతుల మీదుగా అందుకున్నట్లు కళారాధన నాట్యగురువు తాళ్లపాక సందీప్‌కుమార్ తెలిపారు. బాల కళాకారులు అక్షయ, సాహితి, షణ్ముఖప్రియ, నివేదిత, మోనిషారెడ్డి, జస్మిత, నిహారిక తదితరులను అభినందించారు.